## క్లుప్తంగా

### నగరంలో ఐశ్వర్య రాజేష్ సందడి



లబ్బీపేట(విజయవాడతూర్పు): సంక్రాంతికి వస్తున్నాం... ఫేమ్ ఐశ్వర్య రాజేష్ శనివారం నగరంలో సందడి చేసింది. మహాత్మాగాంధీ రోడ్డులోని పీవీఆర్ మాల్‌లో ఏర్పాటు చేసిన వజ్రాభరణాల స్టాల్ లాడియాను ఆమె ప్రారంభించారు. ఐశ్వర్య రాజేష్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆమెతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడ అంటే తనకెంతో ఇష్టమన్నారు. ఇక్కడకు వచ్చిన అభిమానులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో రెండు సినిమాల్లో నటించనున్నట్లు తెలిపారు. తమిళంలో కూడా ఆఫర్లు వస్తున్నాయని, తనను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో షోరూమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

### ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో ఎస్.రమేష్‌బాబు ఇతర అధికారులు, ఆలయ సిబ్బంది, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్లాస్టిక్ వినియోగంపై భక్తులకు అవగహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆలయ సేవలో భాగంగా ప్రాంగణంలోని పలు ప్రదేశాలను శుభ్రం చేశారు.

### రేషన్ బియ్యం స్వాధీనం



విస్సన్నపేట: మినీ వ్యానులో అక్రమంగా తెలంగాణకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విస్సన్నపేట పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలోని వీఎం బంజరలో రేషన్ బియ్యం 45 క్వింటాళ్ల కొనుగోలు చేసి మర్లపాలెంలో కోళ్లఫారానికి విక్రయించి తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మినీ వ్యాన్ యజమాని ధనికొండ గోపిరాజు, డ్రైవరు నక్కా వేణుగోపాలకృష్ణలపై పీడీఎస్ డెప్యూటీ తహసీల్దారు శివనాగరాజు నిత్యావసరాల చట్టం కింద కేసు నమోదు చేశారు.

### ఉపాధి కూలీకి పాము కాటు



మైలవరం: టి.గన్నవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో పాల్గొన్న వ్యక్తి పాము కాటుకు గురయ్యాడు. మైలవరం మండలం చంద్రాల గ్రామ పంచాయతీ శివారు టి.గన్నవరం గ్రామానికి చెందిన మర్రి బాపయ్య గ్రామంలోని చెరువులో జరుగుతున్న ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. చెరువులో మట్టి తవ్వుతుండగా బాపయ్యను పాము కరిచింది. వెంటనే అతనిని ఫీల్డ్ అసిస్టెంట్ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం మైలవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మైలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి మెరుగ్గానే ఉందని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

### అత్తింటి వేధింపులపై కేసు నమోదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరానికి చెందిన మహిళకు హైదరాబాద్‌లోని అత్తింటి వారి వేధింపులపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. బాధితురాలి కథనం ప్రకారం విద్యాధరపురం కామకోటినగర్‌కు చెందిన కూరపాటి హిమబిందుకు కొద్ది మాసాల క్రితం హైదరాబాద్‌కు చెందిన గవని సాయికృష్ణతో వివాహమైంది. వివాహ సమయంలో రెండు లక్షల కట్నం, బంగారం, ఇతర కుటుంబానికి అవసరమైన సామగ్రిని పుట్టింటి వారు అత్తింటి వారికి అప్పగించారు. తొలి నాలుగు మాసాలు బాగానే చూసుకున్నారు. ఆ తరువాత వేధింపులు మొదలయ్యాయి. ఉద్యోగంలో చేరమనటంతో సమీపంలోని పాఠశాలలో టీచర్‌గా పని చేయటం ప్రారంభించింది. కానీ ఆ తరువాత నుంచి అత్త శ్రీవాణి, మామ శ్రీరామకృష్ణ, భర్త సాయికృష్ణ కట్నం సరిపోలేదని, ఉద్యోగానికి వెళితే ఇంట్లో పనులు ఎవరు చేస్తారంటూ వేధించటమే కాకుండా మానసికంగా, శారీరకంగా హింసించటం మొదలు పెట్టారు. వేధింపులు భరించలేక పుట్టింటికి చేరుకున్న హిమబిందు శనివారం భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రూ.3 లక్షలు కొట్టు.. స్టాల్ పట్టు

- భవానీపురం రైతుబజార్‌లో కూటమి గల్లీ నాయకుల దోపిడీ
- నరుకు మా దగ్గరే తీసుకోవాలంటూ వ్యాపారస్తులకు బెదిరింపు
- స్టాల్స్‌లో ఇష్టారాజ్యంగా అమ్మకాలు
- ప్రభుత్వ రైతుబజార్‌లో ప్రైవేట్ కమిటీ హల్‌చల్



భవానీపురం రైతుబజార్ ముఖద్వారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రైతుబజార్ అంటే ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ/నిర్వహణలో ఉండాలి. కానీ భవానీపురం రైతుబజార్ ప్రస్తుతం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కార్యకర్తల కబంధ హస్తాలలో చిక్కుకుని విలవిలలాడుతోంది. తాము చెప్పిందే వేదం అన్న తీరుగా వ్యవహరిస్తున్నారు. టమాటా, బంగాళదుంప, ఉల్లి, మిర్చి వంటి సరుకును తమ దగ్గరే తీసుకోవాలని బెదిరింపులకు దిగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి స్టాల్ హోల్డర్ కార్డులో ఏమున్నాయో అవే సరుకులు విక్రయించాలి. కానీ వారి ఇష్టారాజ్యంగా వేర్వేరు సరుకు అమ్మకాలు సాగిస్తున్నారు. గతంలో రోజుకు ఒకసారి స్టాల్ ప్రదేశాన్ని మార్చేవారు. తరువాత వారానికి ఒక సారి మార్చేవారు. ఇప్పుడు స్టాల్స్‌ను పర్మినెంట్ చేసేశారని తెలుస్తోంది. భవానీపురం రైతుబజార్‌ను 2014లో అప్పటి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. అప్పటి నుంచి రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఉంటూ వ్యాపారాలు చేసుకునేవారు. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఆయా పార్టీల గల్లీ నాయకుల మితిమీరిన జోక్యంతో భవానీపురం రైతుబజార్ నిర్వహణ/పర్యవేక్షణ పరిస్థితి అధ్వానంగా తయారయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**స్టాల్ కావాలంటే రూ.3లక్షలు ఇచ్చుకోవాల్సిందే...**

భవానీపురం రైతుబజార్‌లో మొత్తం 106 షాపులు ఉన్నాయి. వాటిల్లో రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలు, దివ్యాంగులు, రైతు సొసైటీ వ్యక్తుల షాపులు పోను ఆరు షాపులు ఖాళీగా ఉన్నాయి. 20కి పైగా దివ్యాంగుల స్టాల్స్ ఉండగా వారి కాలపరిమితి అయిపోవడంతో వాటిని ఆపేశారు. ఈ క్రమంలో ముగ్గురు స్థానిక టీడీపీ గల్లీ నాయకులు కొంతమంది దివ్యాంగులను అడ్డం పెట్టుకుని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి సిఫారసుతో దాదాపు 7 స్టాల్స్‌ను కొట్టేశారని విశ్వసనీయ సమాచారం. పోలీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ నేత అండతో ఒక వ్యక్తి మరి కొన్ని స్టాల్స్‌ను దక్కించుకున్నాడని సమాచారం. వాటిలో ఒక్కో స్టాల్ రూ.3లక్షల చొప్పున అమ్మేసుకున్నట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కూటమి గల్లీ నాయకులకు ఒకొక్కరికి 3 నుంచి 6 షాపుల వరకు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. వారి వలన ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరికి విన్నవించుకుందామని కొంతమంది స్టాల్ హోల్డర్స్ ఆయన ఆఫీస్‌కు వెళితే, అది తెలుసుకున్న గల్లీ నాయకులు అక్కడికి ఎందుకు వెళ్లారంటూ వారిని మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను వేధింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం.

**ప్రభుత్వ రైతుబజార్‌లో ప్రైవేట్ సంఘం పెత్తనం ఏమిటి?**

స్థానిక కూటమి గల్లీ నాయకులు తమకు అనుకూలురైన కొందరు వ్యాపారస్తులతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకుని రైతుబజార్‌లో హల్‌చల్ చేయడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వానికి చెందిన రైతుబజార్‌లో సంఘం పేరుతో కూటమి గల్లీ బ్యాచ్ పెత్తనం చెలాయిస్తుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. అసలే బేరాలు లేక, సరుకు ఇచ్చినవారికి బిల్లులు కట్టలేక, స్టాల్ అద్దె చెల్లించలేక నానా అవస్థలు పడుతుంటే అధికారంలో ఉన్నామన్న అహంకారంతో తమను బాధ పెట్టడం ఎంతవరకు సమంజసమని కొంతమంది స్టాల్ హోల్డర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ శాఖ అధికారులు స్పందించి కూటమి నాయకుల సిఫారసులు, చిల్లర నాయకుల పెత్తనాన్ని అరికట్టి పార్టీలకు అతీతంగా ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించాలని స్టాల్ హోల్డర్స్‌తోటు వినియోగదారులు కోరుతున్నారు.

## వీఎంసీ సిబ్బంది ఆరోగ్యానికి ప్రాధాన్యం

- కమిషనర్ ధ్యాన చంద్ర
- వీఎంసీలో ఆరోగ్య శిబిరం నిర్వహణ



వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రకు బీపీ పరీక్ష చేస్తున్న వీఎంసీ ఆరోగ్య సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. జాతీయ హైపర్ టెన్షన్ డే సందర్భంగా శనివారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో వీఎంసీ సిబ్బందికి ఉచితంగా బీపీ (రక్తపోటు), షుగర్ (రక్తంలో గ్లూకోజ్) పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్యం సంస్థ పనితీరును ప్రతిబింబిస్తుందని, సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే వారు విధులను సమర్థంగా నిర్వహించగలరన్నారు. శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షల ఫలితాలను సిబ్బందితో చర్చించి, అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయా విభాగాధికారులకు ఆదేశించారు. సిబ్బంది ఆరోగ్యానికి సంబంధించి విభాగాల వారీగా ఆరోగ్య సమాచారం నమోదు చేసి, అవసరమైన వైద్య సహాయం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యాలయ వాతావరణం సౌకర్యవంతంగా ఉండటమే కాకుండా, సిబ్బంది ఆరోగ్యానికి సహకరించే విధంగా మెరుగైన చిట్కాలు, సూచనలు ఇవ్వాలని కమిషనర్ చెప్పారు. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఈ తరహా ఆరోగ్య శిబిరాలు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు.

## ప్రొటోకాల్ దర్శనాలకు ఫార్మాట్‌లో వివరాలు

**ఆదేశాలు జారీ చేసిన ఈవో శీనానాయక్**

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సిఫార్సులు, వీఐపీలు, ప్రొటోకాల్ దర్శనాలకు ప్రత్యేక ఫార్మాట్‌లో వివరాలను దేవస్థానానికి తెలపాలని ఆలయ ఈవో శీనానాయక్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ఫార్మాట్‌ను ప్రకటించారు. భక్తులందరికీ సులభతరంగా అమ్మవారి దర్శనంతో పాటు ఆలయ భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రజా ప్రతినిధులు, అధికార వర్గాల నుంచి ప్రొటోకాల్ దర్శనాలు వస్తున్నాయని, వాటిని క్రమబద్ధం చేసేందుకు ఈ ఫార్మాట్‌ను రూపొందించామన్నారు. దర్శనం కోరుకునే వారి పేరు, ఫోన్ నంబర్, సభ్యుల సంఖ్య, వాహనం నంబర్‌తో పాటు సిఫార్సు చేసిన వారి వివరాలను తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ఈ ఆదేశాలు శనివారం నుంచి అమలులో పెట్టాలని ఆలయ అధికారులు, సిబ్బందిని ఈవో ఆదేశించారు.

## ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా విజయోత్సవ ర్యాలీ

**ర్యాలీలో పాల్గొన్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్**



ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీలో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): భారత సాయుధ దళాలు ఉగ్రదాడులపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతానికి మద్దతుగా దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. డీఆర్ఎం నాయకత్వంలో పెద్ద సంఖ్యలో రైల్వే అధికారులు, సిబ్బంది, ఆర్‌పీఎఫ్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులు, పలు పాఠశాలల విద్యార్థులు ప్లకార్డులు, జాతీయ జెండాలను చేపట్టుకుని 'భారత్ మాతాకి జై', 'జై జవాన్.. జై కిసాన్' నినాదాలతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. విజయవాడ రైల్వే స్టేషన్ తూర్పు ప్రవేశ ద్వారం, క్లాక్ టవర్ వద్ద ఉన్న గాంధీజీ విగ్రహం నుంచి ప్రారంభమైన విజయోత్సవ ర్యాలీ జాక్ అండ్ జిల్ స్కూల్ గుండా రైల్వే స్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫాంలోని బాపూజీ వెయిటింగ్ హాల్ వరకు సాగింది. దీంతో రైల్వే స్టేషన్ ప్రాంగణం జాతీయ నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ మన దేశ సాయుధ దళాల పోరాట పటిమను ప్రశంసించారు. ప్రతికూల పరిస్థితుల్లో దేశ పౌరులందరూ దేశభక్తి, ఐక్యతతో నిలబడటం దేశం సమష్టి బలాన్ని నిరూపించిందని అన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు పీఈ ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు, పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విజయవాడలో కలేకూరి స్మారక సభ

కంచికచర్ల : కవి, రచయిత, ఉద్యమకారుడు కలేకూరి ప్రసాద్ స్మారక సాహిత్యసభను ఈనెల 18వతేదీ ఆదివారం విజయవాడ జిల్లా కోర్టు ఎదురు బుక్స్ సొసైటీ హాల్‌లో జరుగుతుందని నిర్వాహకులు తంగిరాల సోనీ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ప్రజాకవి గోరేటి వెంకన్న, కవులు, రచయితలు తాటి ప్రకాష్, చల్లపల్లి స్వరూపారాణి, జి.లక్ష్మీ నర్సయ్య తదితరులు హాజరుకానున్నట్లు వివరించారు. అందరూ హాజరై సాహిత్యసభను జయప్రదం చేయాలని కోరారు.

## చెట్లను పెంచుదాం.. ఎండ వేడిమిని అధిగమిద్దాం

**జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి**



ర్యాలీలో పాల్గొన్న ప్రత్యేక అధికారి జయలక్ష్మి, ఎమ్మెల్యే బొండా ఉమా, నగర కమిషనర్ ధ్యానచంద్ర

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, పచ్చదనానికి ప్రాధాన్యత ఇచ్చి చెట్లను పెంచడం ద్వారా ఎండ వేడిమిని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని భూ పరిపాలన చీఫ్ కమిషనర్(సీసీఎల్ఏ) ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో 'బీట్ ద హీట్' నినాదంతో సత్యనారాయణపురం సర్కిల్-2 కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛత కార్యక్రమాల విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. ప్రభుత్వ పరంగా చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలను చైతన్యవంతులను చేసి వాటిని విజయవంతం చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమన్నారు. సాధారణంగా పట్టణాలలో ఎక్కువ శాతం భూమి కాంక్రీట్‌తో కప్పబడి ఉంటున్నందున మొక్కలు పెరిగే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని, దీంతో పట్టణ ప్రాంతంలోని ప్రజలు అధిక వేడిమి బారిన పడతారన్నారు. దీనిని అధికమించేందుకు ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రైవేట్ స్థలాల్లో మొక్కలను నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వస్తువులను వినియోగించే సాంప్రదాయాన్ని విడనాడలన్నారు. జిల్లాలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్స్ నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేసి పర్యావరణాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**వేసవిలో ప్రత్యేక చర్యలు..**

నగరపాలకసంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర మాట్లాడుతూ.. జనవరి నుంచి ప్రతి నెలా మూడో శనివారం ఒక ఇతివృత్తంతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని 64 వార్డులలో 186 సచివాలయ పరిధిలో రూ.12 కోట్లతో అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు 84 చలివేంద్రాలను ఏర్పాటు చేశామని, పశువులకు 120 ప్రాంతాల్లో, పక్షులకు 50 ప్రాంతాల్లో నీటి తొట్టెలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమ, ఆర్డీవో కె.చైతన్య, అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాలకృష్ణ, నాయక్, జాయింట్ డైరెక్టర్(అమృత్), జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్, కార్పొరేటర్ శర్వాణిమూర్తి, అధికారులు, ఏఎంహెచ్‌ఓ బాబు శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, శానిటరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారులకు పౌష్టికాహారం అందజేత

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలోని హెల్పింగ్ టు గెదర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ట్రస్ట్, దాతల సహకారంతో నిరుపేద, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కోరంగి నాగమల్లీశ్వరి మాట్లాడుతూ.. నిరుపేద, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామన్నారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. పౌష్టికాహారం లేకపోవటం వల్ల నిరుపేద చిన్నారులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. దీంతో తాము సామాజిక బాధ్యతగా పౌష్టికాహారం అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్‌కే షఫీవుల్లా, హేమంతరావు, రమ్య, బి.వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన కొలతలపై అవగాహన సదస్సు



తూనికలు, కొలతలపై జరిగిన సదస్సులో మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేంద్రప్రసాద్

లబ్బీపేట(విజయవాడ తూర్పు): పెట్రోల్, డీజిల్ కొలతలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ పెట్రోలు బంకులో అవగాహన సదస్సు నిర్వహించారు. కొలతల వారోత్సవాల ను పురస్కరించుకుని నిర్వహించిన ఈ సదస్సులో లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ టి.రాజేంద్రప్రసాద్ పాల్గొని పలు సూచనలు చేశారు. వస్తువులు కొనే సమయంలో ప్రజలు కనీస జాగ్రత్తలు పాటించాలని, కొలతలు, ప్యాకేజీలు పరిశీలించాలన్నారు. గ్యాస్, బంగారం వినియోగదారులు పాటించాల్సిన జాగ్రత్తలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీనియర్ మేనేజర్ ఎ.ఎస్.ఆర్. శేఖర్ తెలియజేశారు. మే 20న ప్రపంచ కొలతల (మెట్రాలజీ) దినోత్సవం సందర్భంగా ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఓసీ రిటైల్ సేల్స్ మేనేజర్ సంతోష్ విజయ్, లారీ ఓనర్స్ కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్ష, కార్యదర్శులు కోనేరు జగదీశ్వరరావు, పి.వి.ఎస్.ఆర్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా.. ఉల్లాసంగా..!

- స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు
- కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో వేసవి శిక్షణ తరగతులు



లాంగ్ డైవింగ్‌కు సూచనలు ఇస్తున్న కోచ్ రఫీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నిన్నటి వరకు నీటిని చూస్తే భయపడేవారు సైతం నేడు నీటిలోకి దూకి చేపపిల్లలా ఈదేస్తున్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 46వ డివిజన్‌లోని కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్ వేసవి శిక్షణ తరగతులకు వేదికైంది. చిన్నారులు ఉత్సాహంగా...ఉల్లాసంగా శిక్షణ తరగతులకు హాజరవుతున్నారు. వేసవి ఎండ తీవ్రత, ఉక్కపోత నుంచి కూడా చిన్నారులకు కాసింత ఉపశమనం పొందేందుకు స్విమ్మింగ్ ఎంతో దోహదపడుతుంది. ఉదయం, సాయంత్రం వేళ నాలుగు బ్యాచ్‌లతో మొత్తం వంద మందికి పైగా చిన్నారులు శిక్షణకు హాజరవుతున్నారు. కోచ్ రఫీ ఆధ్వర్యంలో సీనియర్ స్విమ్మర్లు చిన్నారులకు స్విమ్మింగ్‌లో మెలకువలను నేర్పిస్తున్నారు. స్విమ్మింగ్ చేసే తరుణంలో పాటించాల్సిన నియమాల గురించి తొలుత వివరించడమే కాకుండా వారితో వ్యాయామం కూడా చేయిస్తున్నారు. గడిచిన 16 రోజులలో స్విమ్మింగ్‌లోని మెలకువలను నేర్చుకున్న చిన్నారులకు శనివారం లాంగ్ డైవింగ్ చేయించారు. ఈ నెల రోజుల శిక్షణ శిబిరంలో చిన్నారులకు స్విమ్మింగ్ చేయడంలో అన్ని మెలకువలను నేర్పిస్తామని కోచ్ తెలిపారు. వేసవి శిక్షణ పూర్తయిన అనంతరం విద్యార్థులను నదులు, చెరువులలో స్విమ్మింగ్‌కు పంపవద్దని, పూర్తి స్థాయిలో శిక్షణ పూర్తయిన తర్వాతే వారిని నదిలో స్విమ్మింగ్‌కు అనుమతించాలని కోచ్ రఫీ సూచించారు. చిన్నారుల ఉత్సాహాన్ని చూస్తున్న తల్లిదండ్రులు వేసవి సెలవుల అనంతరం కూడా తమ పిల్లలకు స్విమ్మింగ్‌లో శిక్షణ ఇప్పించేందుకు తగిన సమయాన్ని కేటాయించేలా చూస్తామని అంటున్నారు.



కోచ్ పర్యవేక్షణలో స్విమ్మింగ్ చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు స్విమ్మింగ్‌లో మెలకువలను నేర్పిస్తున్న సీనియర్ స్విమ్మర్లు

## 25న 'వన్ ఎర్త్ వన్ లైఫ్'పై చిత్రలేఖన పోటీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణ పట్ల 4 నుంచి 10వ తరగతి విద్యార్థులలో అవగాహన పెంపొందించేందుకు ఈ నెల 25న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'వన్ ఎర్త్ వన్ లైఫ్' అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు 'ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్' నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు, ఐదు, ఆరవ తరగతి విద్యార్థులను జూనియర్స్‌గా 7 నుంచి 10వ తరగతి వరకు సీనియర్లుగా విభజించినట్లు పేర్కొన్నారు. జూనియర్స్‌కు 'పర్యావరణాన్ని రక్షిద్దాం', సీనియర్స్‌కు 'హరిత భూమిని సృష్టించడంలో నా పాత్ర' అన్న అంశాలపై చిత్రలేఖన పోటీలు ఉంటాయని అన్నారు. ఆ రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పోటీలు జరుగుతాయని, మధ్యాహ్నం 12 గంటలకు విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పోటీలో పాల్గొనేందుకు ఆసక్తి చూపే విద్యార్థులు 9347950085 మొబైల్ నంబర్‌కి కాల్ చేయటం లేదా వాట్సప్ ద్వారా ఈ నెల 22వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించటంతో పాటు పర్యావరణం పట్ల తమ అవగాహనను వ్యక్తీకరించేందుకు ఈ పోటీ దోహదపడుతుందని తెలిపారు.

## భక్తితత్వాన్ని పెంపొందించిన అన్నమయ్య సంకీర్తనలు



ముత్యాలంపాడులో అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న గాయకులు



లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపట్టాభి రామచంద్రస్వామివారి దేవాలయంలో శనివారం కొప్పరపు ఉమాబలరాం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను భక్తితన్మయత్వంలో ముంచెత్తాయి. అన్నమయ్య సంకీర్తనా గాన ప్రచార భక్త బృందం వ్యవస్థాపకుడు శాస్త్రీయ సంగీత విద్వాంసులు, బ్రహ్మశ్రీ పప్పు సదాశివశాస్త్రి ఆధ్వర్యాన శ్రీ పట్టాభిరామ చంద్రస్వామి దేవాలయంలో అన్నమయ్య సంకీర్తనల గానం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పరపు ఉమాబలరాం ఆలపించిన భావయామి గోపాల బాలం, చేరి యశోదకు, నారాయణ నీ నామమే గతి యిక, జగన్మోహనాకారా తదితర 15 జనరంజకమైన అన్నమ్మయ్య కీర్తనలు మృదుమధురంగా ఆలపించారు. అలాగే పప్పు సదాశివశాస్త్రి ఆలపించిన అన్నమయ్య కీర్తనలను భక్తులను భక్తిపారవశ్యంలో తేలియాడించాయి. అన్నమయ్య కీర్తనలను ఆద్యంతం శ్రావ్యంగా ఆలపించారు. మృదంగం కేబీ కిశోర్, వయోలిన్ చావలి శ్రీనివాస్, కే బోర్డు దావులూరి వీరభద్రరావు వాయిద్య సహకారం అందించారు.

**అలరించిన అన్నమయ్య సంకీర్తనం**

విజయవాడకల్చరల్: శ్రీ వెంకటేశ్వర సంకీర్తనా అకాడమీ, కంచికామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర, వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవాలు భక్తిగా సాగుతున్నాయి. లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం జరిగిన కార్యక్రమంలో చిన్నారులు సహితం అన్నమయ్య పద యజ్ఞంలో పాల్గొన్నారు. పరాశరం వరేణ్య, దుగ్గిరాలహాస శ్రీమేధ, గానుగపాటి కావ్య, ఆచాంట సాయి మిత్ర మంజీర, బి.కామేశ్వరి, ఎస్‌సీ సాయి శాంతిశ్రీ, మల్లాది సూరిబాబు, కస్తూరి గోపాలరావు, మోదుమూడి సుధాకర్ అన్నమయ్య రంచించిన సంకీర్తనలను మధురంగా గానం చేశారు. ట్రస్టీబోర్డ్ చైర్మన్ మాగంటి వేణుగోపాల్, కార్యనిర్వాహకుడు సీహెచ్ రామ్మోహనరావు, మేనేజర్ శర్మ నిర్వహించారు.

## రేపటి నుంచి హనుమత్ జయంతి ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీహనుమత్ దీక్షా పీఠంలో 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు హనుమత్ జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి శ్రీదుర్గాప్రసాద్ స్వామిజీ తెలిపారు. 18వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు విశేష ఆరాధన, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, రక్షాబంధనం జరుగుతుందన్నారు. 19వ తేదీ సోమవారం అగ్నిప్రతిష్ట, స్థాపిత దేవతారాధన, సుందరకాండ మన్యుసూక్త-మూలమంత్ర హోమాలు, హనుమత్ దీక్షా విరమణలు జరుగుతాయన్నారు. 20వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సుందరకాండ పారాయణం జరుగుతుందన్నారు. 21వ తేదీ సద్గురు సయ్యద్ అప్పల స్వామి వారి 152వ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ, పవిత్ర కృష్ణానది పుణ్యస్నానం, చక్రస్నానం, పంచముఖ ఆంజనేయ స్వామి వారికి సింధూర ఉత్సవం జరుగుతుందన్నారు. 22వ తేదీ హనుమత్ జయంతిని పురస్కరించుకుని స్వామి వారికి పంచామృత అభిషేకాలు, నాగావళి దళార్చన, పూర్ణాహుతి అన్నప్రసాద వితరణ జరుగుతుందని, 23వ తేదీ సాయంత్రం వరకు అఖండ శ్రీహనుమాన్ చాలీసా పారాయణం, సంకీర్తన జరుగుతుందని పేర్కొన్నారు. దీక్ష విరమణలకు విచ్చేసే భక్తులకు 5 రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.